

రేపటి నుంచి సత్యదేవుడి 135వ ఆవిర్భావ వేడుకలు 7

గోర్సలో గ్రామస్తుల ఆందోళన
» దేవాలయ భూముల్లో ఆక్రమణదారులు సాగు చేయడానికి వీలులేదని బైఠాయింపు 7

మాయాపట్నం ప్రజలకు సహాయక చర్యలు చేపట్టండి

» అధికార యంత్రాంగానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలు

కొత్తపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఉప్పాడ శివారు మాయాపట్నంలో సముద్ర కెరటాలు ఇళ్లల్లోకి దూసుకెళ్లిన ఘటనలో మత్స్యకారులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మాయాపట్నంలో బుధవారం ఉదయం సముద్రం ఉప్పొంగి కెరటాలు మత్స్యకారుల ఇళ్లల్లోకి చేరి బయటకు రాలేని పరిస్థితులను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన వెంటనే స్పందించారు. సముద్రం నీరు ఇళ్లల్లోకి వెళ్లడంతో అక్కడ ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని, ఆహారం, పాలు, మంచినీరు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. వైద్యసిబ్బందిని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గతంలో ఉప్పాడ కోత నివారణకు నిర్మించిన జియోట్యూబ్ పరిస్థితి గురించి ఆరాతీసినట్టు డిప్యూటీ సీఎం కార్యాలయంనుంచి వెలువడిన సమాచారంలో పేర్కొన్నారు.

ఉప్పాడలో ఉప్పొంగిన సముద్రం

» ఇళ్లల్లోకి దూసుకెళ్లిన కెరటాలు
» సముద్రంలో కలిసిన పది ఇళ్లు
» భయంతో పరుగులు తీసిన మత్స్యకారులు

నేడునాడు



కొత్తపల్లి మండలం మాయాపట్నంలో మత్స్యకారుల గుడిసెల్లోకి చేరిన సముద్రంనీరు

కాకినాడ తీర ప్రాంత రక్షణకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలి
» కొత్తపల్లి మండలంలో 650 ఎకరాల భూమి, వెయ్యికిపైగా ఇళ్లు సముద్రంలో కలిశాయి
» లోక్‌సభలో ప్రస్తావించిన ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ 6



స్పందించారు.. పెంచారు

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పందించి వేతనాల పెంపుదలకు అంగీకరించారు. కేటగిరి-1 అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలను రూ.21,500 నుంచి రూ24,500కు, కేటగిరీ-2లో 18,500 నుంచి 21,500కి, కేటగిరి-3లో 15,000 నుంచి 18,500కి పెంచారు. వేతనాల పెంపు వల్ల కలిగే అదనపు భారాన్ని ఆయా కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు తమ నిధులు నుంచి భరించాల్సి ఉంటుంది.

అల ఆనందపురం!

పుర కార్మికుల జీతాలు పెంపు

» 20 ఏళ్ల తరువాత పెంపుదల
» ఒక్కొక్కరికి రూ.3,500 లబ్ధి
» 730 మంది కార్మికుల ఆనందం
» అవుట్‌సోర్సింగ్ వర్కర్ల హర్షం
» మరో హామీ నెరవేర్చిన సర్కారు

పట్టణాలు, నగరాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ సహా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మూడు కేటగిరిల్లో ఉన్న వర్కర్ల వేతనాలను రూ.3,500 చొప్పున పెంచి జీవో జారీ చేయడంపై కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో కీలకమైన ఇంజనీరింగ్ విభాగంతోపాటు వాటర్ వర్క్స్, వీధి దీపాల నిర్వహణ, కంప్యూటర్ విభాగాల్లో అవుట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. ఈ విభాగాల్లో రెగ్యులర్ ఉద్యోగుల కంటే వీరి సంఖ్యే అధికం. తాగునీటి సరఫరా, స్ట్రీట్ లైటింగ్ తదితర అంశాలపై ప్రజలకు మెరుగైన సేవలందడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు. కొంతకాలంగా వీరి వేతనాలు పెరగలేదు. పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచినా ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వారి వేతనాలను గత వైసీపీ ప్రభుత్వం పెంచలేదు. తమ వేతనాలు పెంచాలంటూ వీరు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా తెలుగుదేశం కూటమి నాయకులు గత ఎన్నికల సమయంలో వీరి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత జీతాల పెంపుతోపాటు ఇతర డిమాండ్లపై తగిన స్పందన లభించకపోవడంతో ఇటీవల ఆందోళనబాట పట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఇంజనీరింగ్ వర్కర్లు పిఠాపురంలో భారీ ప్రదర్శన జరపడంతోపాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాలు అందించారు.

మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు

అప్కాస్ (ఏపీ అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్)పై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం వీరి డిమాండ్లను పరిశీలించి వేతనాలు పెంచాలని సిఫారసు చేసింది. దీనికి ప్రభుత్వం అంగీకరించి ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న నాన్ పీహెచ్ వర్కర్లకు తదుపరి కేటగిరి వేతనాలు వర్తింపజేయడం ద్వారా రూ.3,500 వరకూ పెంపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఇంజనీరింగ్‌తో సహా వివిధ విభాగాల్లో ఉన్న మూడు కేటగిరీల నాన్ పీహెచ్ వర్కర్లకు వేతనాల పెంచడంతో హర్షం వ్యక్తంచేస్తున్నారు.

730 మంది కార్మికులు

కాకినాడ జిల్లాలో కాకినాడ కార్పొరేషన్, పిఠాపురం, పెద్దాపురం, తుని, సామర్లకోట మునిసిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలు, తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మునిసిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న సుమారు 730 మందికి పైగా అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనపెంపు ప్రయోజనం లభిస్తుందని యూనియన్ ప్రతినిధులు చెబుతున్నారు. సుదీర్ఘకాలంగా తాము కోరుతున్న వేతనాల పెంపును ప్రభుత్వం అంగీకరించడంతో ఆనందోత్సాలు వ్యక్తంచేస్తూ స్వీట్లు పంచుకున్నారు.



పిఠాపురంలో పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మునిసిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కూటమి ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతామని మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ పిఠాపురంలోని జిల్లా ప్రతినిధులు సీహెచ్ సురేష్‌కుమార్, చిన్నారి సురేష్ తదితరులు తెలిపారు. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న తమ కష్టాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. ఇక రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఇంజనీరింగ్ వర్కర్లు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును కలిసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అవుట్ సోర్సింగ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమాదుల ఏసుబాబు, సహాయ కార్యదర్శి బుంగ యేసురాజు, జిల్లా అధ్యక్షుడు కొటాని ముకుందరాం, నగర అధ్యక్షుడు సిరిక ప్రసాద్, కార్యదర్శి బాలభవాని కుమార్, ఉపాధ్యక్షుడు బి సాయి.. సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. గత వైసీపీలో ఎన్ని ఆందోళనలు చేసినా ఎవరు పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం తమ డిమాండ్లను గౌరవించి వేతనాలు పెంచడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో 13వేల మంది కార్మికులు ప్రయోజనం పొందారని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. కాగా మండపేటలోనూ సీఎంకు పాలాభిషేకం చేశారు.

20 ఏళ్ల కల తీరింది..



వాటర్ వర్క్స్ సిబ్బంది ఇబ్బందులను అర్థం చేసుకుని యూనియన్ తరఫున మేము చేసిన పోరాటాన్ని గుర్తించిన ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం. రూ.3,500 జీతం పెంచడం పట్ల ఆనందంగా ఉన్నాం. పదేళ్ల తర్వాత ఇంత పెద్ద మొత్తంలో జీతం పెరగడం సంతోషం. పీఆర్సీ కూడి ఇస్తామన్నారు. దీనిపట్ల మా యూనియన్‌లో హర్షం వ్యక్తమవుతోంది.

- ఏకల శ్రీనివాసరావు, యూనియన్ ఉపాధ్యక్షుడు, కాకినాడ నగరపాలక సంస్థ

కాకినాడలో రవాణాశాఖ మంత్రి..

బిజీబిజీ పర్యటన



మహిళలకు నమస్కరిస్తున్న రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

» 'తొలిఅడుగు-సుపరిపాలన'లో ప్రజలతో మమేకం
» రవాణాశాఖ అధికారులతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమావేశం

కాకినాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాష్ట్ర రవాణాశాఖ, క్రీడలు మంత్రిత్వశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగింది. మంగళవారం రాత్రి కాకినాడ చేరుకున్న మంత్రి బుధవారం ఉదయం నుంచి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా కాకినాడ 39వ డివిజన్‌లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం తో కలిసి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.7లక్షల చెక్‌ను బాధిత కుటుంబానికి అందజేశారు. మోటార్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో రవాణాశాఖాధికారులతో మధ్యాహ్నం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శాఖాపరమైన కార్యక్రమాల అమలు, ప్రగతి, వాటి నిర్వహణలో అధికారులు,సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సమీక్షించారు. రవాణాశాఖలో పారదర్శకత, సమర్థసేవల కల్పన, ఆదాయ వృద్ధి, రహదారి భద్రత తదితర అంశాలపై ఆయన అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. గత ప్రభుత్వం ఆదాయ సేకరణకే ప్రాధాన్యమిచ్చి, సిబ్బందికి వాహనాలు కల్పించకుండా రవాణాశాఖను నిర్లక్ష్యం చేసి నిర్వీర్యం చేసిందన్నారు. రవాణాశాఖలో ఖాళీగా ఉన్న ఆర్టీవో, డీటీసీ, ఏఓ, ఎంవీఐ, ఓఎంవీఐ ఇతర కేడర్ పోస్టులను భర్తీ చేసి వాహనాలు ఇతర కనీస అవసరాలు కల్పించి శాఖకు పూర్వవైభవాన్ని తెస్తామన్నారు. జిల్లాల విభజన జరిగాక, చాలా జిల్లాల్లో రవాణా శాఖ కార్యాలయాలకు సరైన భవనాలు కూడా లేవని, త్వరలో అన్ని కార్యాలయాలకు భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదించామన్నారు. రహదారి ప్రమాదాల నివారణలో పోలీసు, రవాణాశాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రీన్‌ట్యాక్స్ రద్దు చేయడం వల్ల ఆదాయ సేకరణ తగ్గినా, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాలను పటిష్టంగానిర్వహించడం, ఫీజులు, జరిమానాలను సమర్థంగా వసూలు చేయడం ద్వారా ఆదాయ సేకరణ లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రతా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన, ఆచరణ పెంచాలని కోరారు. ఓవర్ లోడింగ్, డ్రంకన్ డ్రైవ్‌లను నిరోధించి రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. క్షేత్రస్థాయిలో రవాణాశాఖ ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ తగిన పరిష్కారం చూపుతామని వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు. సమావేశంలో రహదారి భద్రత సందేశాలతో రవాణాశాఖ ప్రచురించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పక్కనే ఎమ్మెల్యే వనమాడి

కాకినాడలో భారీ స్విమ్మింగ్‌పూల్

కాకినాడలో త్వరలో అతిపెద్ద స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి చర్యలు చేపడతామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మెజారిటీ త్వరలోనే స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు.



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో నాయక్

హైరిస్క్ ప్రెగ్నెన్సీపై వైద్యాధికారులకు శిక్షణ

» డీఎంహెచ్‌వో నరసింహనాయక్

జీజీహెచ్(కాకినాడ),జూలై 23(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశానుసారం ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీలపై రెండు రోజుల శిక్షణను నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహ నాయక్ తెలిపారు. బుధ, గురువారాల్లో కాకినాడ కుళాయి చెరువు, వివేకానంద పార్క్‌లోని స్మార్ట్ సిటీ హాల్‌లో బుధవారం జరిగిన శిక్షణ డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ అధ్యక్షతన ఈహెచ్‌సీ, యూపీహెచ్‌సీల వైద్యాధికారులకు, ప్రోగ్రామ్ ఆఫీసర్‌లకు శిక్షణ ఇచ్చారు.ఈకార్యక్రమం సంబంధిత వైద్యాధికారులకు రెండురోజులు విభజించి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అత్యధిక ప్రమాదకరమైన గర్భిణులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సహాయం అందించడంలోని నైపుణ్యాలను పీపీటీ ద్వారా వివరించారు. ముఖ్యంగా అనీమియా, హైపర్ టెన్షన్, ప్రి ఎక్లాంప్సియా, జీడీఎం, సిజేరియన్ కేసెస్, గర్భం దాల్చిన సమయంలో, ప్రసవం సమయంలో వచ్చే ప్రమాదాలను గుర్తించి తగిన విధంగా వైద్యసేవలను అందిస్తూ మాతృమరణాలు, శిశు మరణాలను అరికట్టేలా హైదరాబాద్ నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్ డాక్టర్ స్రవంతి, డాక్టర్ జగదాంబ, డాక్టర్ దీపికలు వైద్యులను సమాయత్తం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, డాక్టర్ ఐ.ప్రభాకర్, డాక్టర్ వి.అరుణ, డాక్టర్ జి.లక్ష్మి, డాక్టర్ ఎస్.ప్రశాంతి పాల్గొన్నారు.

పోలవరం పనులు పరిశీలించిన కలెక్టర్

» ఎడమ కాలువ నిర్మాణ పురోగతిపై అధికారులకు సూచనలు
» ఇటీవల గాయపడిన బాధిత కుటుంబాలకు పరామర్శ



పోలవరం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

తునిరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తుని మండలం కుమ్మరిలోవ సమీపంలో జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు.

తుని పట్టణంలోని 1వ వార్డులో పోలవరంపనులు జరుగుతున్న ప్రాంతంలో బండరాయి దొర్లుకు వచ్చి పలువు రు గాయపడిన ఘటన ఇటీవల జరిగింది. ఆ క్షతగాత్ర కుటుంబాలను కలెక్టర్ ముందుగా పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్అండ్‌బీ బంగ్లాలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. అధికారులతో కలిసి కొండ ఎగువున జరుగుతున్న తవ్వకాలను, అక్విడెక్ట్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 12 ఏళ్లుగా వివిధ కారణాలతో కుమ్మరిలోవలో పోలవరం ఎడమ కాలువ నిర్మాణపనులకు పలు ఆటంకాలు ఏర్పడ్డాయని, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి పనుల పురోగతికిప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని తెలిపారు. కుమ్మరిలోవ కాలనీవాసుల సహకారంతో ఇప్పటి వరకు 30లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించామని, ఇంకా 50లక్షల పైబడి క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించి కాలువ నిర్మాణం చేయాల్సి ఉందని అన్నారు. పోలవరం ఎడమ కాలువ పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని, నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పనులు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశామని తెలిపారు. పరిశీలనలో పెద్దాపురంఆర్డీవో శ్రీరమణి, పోలవరం ఎడమ కాలువ ఎస్ఈ ఏసుబాబు, ఈఈ గోవిందరాజులు, తహశీల్దారు జీవీ ప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

పట్టణ వాసులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి: మున్సిపల్ చైర్‌పర్సన్

తుని పట్టణంలో 1వ వార్డులో కొండ దిగువున నివాసముంటున్న తుని పట్టణవాసులకు ఇబ్బందులు లేకుండా పనులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని తుని మున్సిపల్ చైర్‌పర్సన్ భువన సుందరి కౌన్సిలర్లతో కలిసి తునిలో కలెక్టర్‌ను కోరారు. ఇటీవల పోలవరం పనుల్లో గాయపడిన బాధితుల గోడును వారు తెలియజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ న్యాయం చేస్తామన్నారు.



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వీధి సుబ్రహ్మణ్యం హత్య వెనుక వైసీపీ పెద్దల హస్తం 7
» త్వరలోనే అసలు విషయాలు బయటకు : టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజేష్

పెద్దాపురంలో వ్యభిచారగృహ నిర్వాహకురాలికి సహకారం
» కానిస్టేబుల్, హోంగార్డ్ సస్పెన్షన్ » ఎస్ఐ, పోలీస్ అధికారులపై క్రమశిక్షణా చర్యలకు కాకినాడ జిల్లా ఎస్పీ సిఫార్సు 7

కాకినాడ కోర్టుకు హాజరైన జనసేన నేతలు 7

గుమ్మడికాయల మాటున గోవుల అక్రమ తరలింపు 7

ఉపాధ్యాయురాలి ఆత్మహత్యాయత్నం

» ఉన్నతాధికారుల వేధింపులే కారణమని ఆరోపణ

జీజీహెచ్(కాకినాడ),జూలై23(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఉపాధ్యాయురాలు తెలిపింది. ఆమె ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. బాధితురాలు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తాను గతంలో రంగంపేట మండలం వెంకటాపురంలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తించే సమయంలో హెచ్ఎం గంగరాజు, టీచర్‌లు చిన్నఅప్పారావు, శ్రీనివాసరావు తనపై లేనిపోని వదంతులు సృష్టించి తనను సస్పెండ్ చేయించారని, దీనిపై తాను కోర్టును ఆశ్రయించానని కాకినాడ రూరల్ మండలం గంగరాజునగర్‌కు చెందిన దూడల సుశీల తెలిపారు. అప్పుడు రాజమహేంద్రవరం డీఈవో తనకు సర్దిచెప్పి కేసు విత్‌డ్రా చేయించారని ఆమె చెప్పారు. తనకు పోస్టింగ్ ఇప్పిస్తానని చెప్పి కాకినాడ డీఈవోను సంప్రదించాలని చెప్పారన్నారు. ఈ క్రమంలో కాకినాడ డీఈవోను సంప్రదించగా ఆయన కావాలని తనను ఇబ్బందులకు గురి చేసి పోస్టింగ్ ఇవ్వకుండా తాత్సారం చేశారని వాపోయారు. ఇక తప్పక కలెక్టర్‌కు తన బాధను వ్యక్తపర్చడంతో పోస్ట్ వేయమని డీఈవోకు తెలియపర్చగా గండేపల్లి మండలం కె.గోపాలపురంలో కుగ్రామంలో పోస్టింగ్ ఇచ్చారన్నారు. అక్కడికి వెళ్లేందుకు ఆరోగ్యం సహకరించడం లేదని మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను వెన్నెముక నొప్పితో బాధపడుతున్నానని,కాకినాడలో చికిత్స చేయించుకోవాలని, తనకు ముగ్గురు పిల్లలున్నారని బతిమలాడి దగ్గరలో పోస్టింగ్ ఇప్పించాలని కోరానని వాపోయారు. అయినా డీఈవోతోపాటు ఏడీ, సర్వశిక్ష అభియాన్ అధికారి ఇష్టం వచ్చినట్లు మాట్లాడి మానసికంగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. తనను జరినట్లు మరెవరికీ జరగకూడదని, వారిపై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. కాగా, ఈ ఘటనపై సర్పవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సుశీల

మహిళా శిశుసంక్షేమశాఖ

పీడీగా దుర్గాదేవి

కార్పొరేషన్(కాకినాడ), జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఎఫ్ఏసీ ఇన్‌చార్జిగా సీహెచ్ ఎస్‌కే దుర్గాదేవి బాధ్యతలు చేపట్టనున్నారు.గత పీడీ విజయకుమారి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. దీంతో పిఠాపురం సీడీపీవో దుర్గాదేవికి ఎఫ్ఏసీ పీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.ఆమె ఒకటి,రెండురోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.





దుర్గాడలో శాకంబరేశ్వరుడిగా రామలింగేశ్వరస్వామి

గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో కొలువైన ఉన్న పంచాతయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామిని శాకంబరేశ్వరుడిగా అలంకరించారు. ఆషాఢ మాసం, మాసశివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సప్తహారతులు సమర్పించారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, సేవా సమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. - ఆంధ్రజ్యోతి/గొల్లప్రోలు రూరల్



పిఠాపురంలో శాకంబరిదేవి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు

మహాలక్ష్మి అమ్మవారికి శాకంబరి అలంకారం

పిఠాపురం : శృంగేరి శంకరమఠం నిర్వహణలో పిఠాపురం పట్టణంలోని పెద్దబజారులో కొలువై ఉన్న మహాలక్ష్మీ అమ్మవారికి శాకంబరీదేవి అలంకారం చేశారు. బుధవారం అమ్మవారిని పలు రకాల కాయగూరలు, పండ్లతో అలంకరించారు. ఆలయ నిర్వాకుడు ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు పూజాదికాలు నిర్వహించారు.



శాకంబరిగా దర్శనమిస్తున్న మాణిక్యాంబ అమ్మవారు.. సారె సమర్పించిన మహిళలు



శాకంబరిగా హసన్‌బాద మాణిక్యాంబ అమ్మవారు

సారె సమర్పించిన గ్రామస్తులు

ద్రాక్షారామ, జూలై23(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాద గ్రామంలో ఉన్న భీమేశ్వరస్వామి సమేత మాణిక్యాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం మాణిక్యాంబ అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఉండి వీరభద్రశర్మ అమ్మవారికి శాకంబరిగా అలంకరించారు. అనంతరం గ్రామస్తులు పసుపు, కుంకుమ, పుష్పాలు, స్వీట్లు, పండ్లతో కూడిన సారెతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో చింతపల్లి సతీష్ దంపతులు, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు దంపతులు, చెక్కాతాతాజీ దంపతులు, జెడ్పీమాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, చెక్కా చినసోమరాజు దంపతులు, చోడిశెట్టి వీరభద్రరావు పాల్గొన్నారు.



శాకంబరీ అమ్మవారిగా బాలాత్రిపుర సుందరి

బాలాత్రిపురసుందరికి చీర, సారె

ఘనంగా లక్ష పసుపు కొమ్ముల పూజ... శాకంబరీ అలంకరణతో అమ్మవారి దర్శనం

సామర్లకోట, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాస పర్వదినాలను పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారికి శాకంబరీ అలంకారంలో పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా సామర్లకోట గ్రామ దేవత నూకాంబికా అమ్మవారి ఆలయం నుంచి ముత్తైదువలు, దాతలు సమకూర్చిన చీర, సారె పిండివంటలు, పండ్లను మహిళలు ప్రదర్శనగా బాలాత్రిపురసుందరి అమ్మవారికి సమర్పించేందుకు బుధవారం తరలివచ్చారు. ఈ ప్రదర్శన అగ్రభాగాన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తన శిరస్సున అమ్మవారికి చీర,సారె, పసుపుకొమ్ములతో కూడిన పళ్లెంతో ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ తదితరుల వేదమంత్రోచ్ఛరణల మధ్య భీమేశ్వరాలయంలో మహిళల నుంచి చీర, సారెలతో కూడిన పిండి వంటకాలను, పసుపుకొమ్ములను స్వీకరించారు. మొట్టమొదటిసారిగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో భక్తులు, దాతలు అందించిన సుమారు రెండు టన్నుల పరిమాణం గల పసుపుకొమ్ములతో లక్ష పసుపు కొమ్ముల పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) దంపతులు ఆశీనులయ్యారు. పూజ అనంతరం పసుపుకొమ్ములను మహిళా భక్తులకు అందజేశారు.

శాకంబరీగా అమ్మవారు..

ఆషాఢమాసం పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారిని శాకంబరీ అమ్మవారిగా సర్వాంగసుందరంగా అలంకరించి భక్తులకు దర్శనాల నిమిత్తం అనుమతించారు. సుమారు 108 రకాల పిండివంటలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించారు. ఆలయ ఆవరణలో సుమారు నాలుగు టన్నుల పరిమాణం గల కూరగాయలు, ఆకుకూరలతో ఆలయంలోని అన్ని ఉపాలయాలను, దేవతా మూర్తులను కూరగాయల మాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. నంది మండపం వద్ద శివలింగాకృతిలో కూరగాయలతో, ఆకుకూరలతో అలంకరించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, అందుగుల జార్జి చక్రవర్తి, ఆర్వీ. సుబ్బరాజు, కర్రి ఆదినారాయణ, కంచర్ల సుష్మామోహిని, కటకం హైమావతి, రత్నకుమారి, కాపుగంటి పైడిరత్నం, సత్తి అరుణ, మద్దాల గీత పాల్గొన్నారు.





చీర, సారెలతో ప్రదర్శనగా తరలివెళుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప, మహిళలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రతి అన్నదాతకు వ్యవసాయ కనెక్షన్

- పుష్కరాలకు ఇప్పటి నుంచే సిద్ధం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

రాజమహేంద్రవరం, జూలై23(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసుకున్న ప్రతి అన్నదాతకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే విద్యుత్‌శాఖ సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోటల్టేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో విద్యుత్ శాఖ నిర్వీర్యమైందన్నారు. శాఖపై కొందరు వదంతులు సృష్టించి గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 75వేల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చామని, రైతులపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని తెలిపారు. విద్యుత్ ఇబ్బందులు లేకుండా చేయడానికి అవసరమైతే అదనపు సిబ్బందిని నియమిస్తామన్నారు. పారిశ్రామిక, వ్యాపార ప్రాంతాల్లో వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై వెంటనే స్పందించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. శాఖాపరంగా, నిర్వహణలో ఏదైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి ప్రయత్నిస్తానని అధికారులతో చెప్పారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ఎస్ఈ తిలక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ తీర ప్రాంత రక్షణకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలి

- లోక్‌సభలో ప్రస్తావించిన కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ),జూలై23(ఆంధ్రజ్యోతి): సముద్ర అలల కారణంగా కోతకు గురవుతున్న కాకినాడ తీర ప్రాంతాన్ని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం ఆయన లోక్‌సభలో రూల్ 377 కింద ఈ అంశాన్ని లేవనెత్తారు. జాతీయ తీర పరిశోధనా కేంద్రం నివేదిక ప్రకారం కాకినాడ తీర ప్రాంతంలో 52.8శాతం భూభాగం కోతకు గురవుతోందన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అత్యధికమన్నారు. దీనివల్ల తీరప్రాంత గ్రామాలైన ఉప్పాడ, నేమాం, కొమరగిరి, అమీనాబాద్, సుబ్బంపేట గ్రామాల్లో ఇప్పటివరకు 650 ఎకరాల భూమి, వెయ్యికిపైగా ఇళ్లు సముద్రంలో కలిసినట్టు నివేదికలు చెప్తున్నాయని వివరించారు. మత్స్యకారులు, రైతులతోపాటు జాతీయ ఖ్యాతి గాంచిన ఉప్పాడ జంథానీ చీరలు తయారు చేసే చేనేత కార్మికుల జీవనోపాధిపై కూడా ఈ సమస్య తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కోత రక్షణకు ఇప్పటివరకు ఉపయోగించిన సీవాల్స్ జియోట్యూబ్ సత్ఫలితాలు ఇవ్వలేదన్నారు. శాశ్వత పరిష్కారం కోసం కాకినాడ కోస్టల్ ఎరోషన్ మిటిగేషన్ ప్రాజెక్టును జాతీయ తీర పరిశోధనా కేంద్రం సహకారంతో ఏపీ రాష్ట్ర విపత్తు నిర్వహణశాఖ రూపొందించిందన్నారు. రూ.323కోట్ల వ్యయంతో తయారైన ఈ ప్రాజెక్టులో టెట్రాపాడ్, సీవాల్స్, గ్రోయిన్స్ బీచ్ నరిష్మెంట్‌తో కోతకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. హోంమంత్రిత్వ శాఖ త్వరితగతిన ఆమోదించాలని కోరారు.

పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



కాకినాడ జిల్లా క్రీడామైదానంలో పారాస్పోర్ట్స్ ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ),జూలై 23(ఆంధ్రజ్యోతి): పారా 6వ రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 ఎంపిక కోసం కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడామైదానంలో పారాస్పోర్ట్స్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు బుధవారం నిర్వహించారు. కాకినాడజిల్లా స్విమ్మింగ్ కోచ్ పైల అప్పలనాయుడు, సీఎస్‌బీ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ వి.సతీష్‌కుమార్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.రామస్వామి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. జిల్లా నలుమూలలనుంచి 50మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పాతవారితోపాటు మొదటిసారి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పారా క్రీడల ద్వారా తమ పిల్లలకు భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా ఇన్చార్జి, ఇంటర్నేషనల్ మెడలిస్ట్ జి.శివగంగా దుర్గ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు టి.రాము, నేషనల్ స్విమ్మర్ నూకరాజు, దివ్యాంగ సంస్థల ప్రతినిధులు, కోచ్‌లు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా రిపేర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు



అధ్యక్షుడిగా ఎన్నికైన నరసింహారావును సత్కరిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 23(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో చేపట్టే కాటా, వేబ్రిడ్జి, చిన్న కాటా రిపేర్ వర్కర్స్ నూతనంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రిపేర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా లంకలపల్లి నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా టేకుమూడి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కొప్పిశెట్టి శ్రీనుబాబు, సంయుక్త కార్యదర్శిగా పిడపర్తి రమేష్, కోశాధికారిగా కనితి బ్రహ్మానందంచారి, సభ్యులుగా యాళ్ల రాజీవ్‌రావు, మహేశ్వరరావు, దిగుమర్తి వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ జనార్దన్, అసిస్టెంట్ కంట్రోలర్ సలీంలను కార్యవర్గం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది.

హోరాహోరీగా తలపడిన మెడికోలు

- రాజానగరం జీఎస్ఎల్ కళాశాలలో ఉత్సాహంగా క్రీడా పోటీలు
- సత్తా చాటిన మహిళా మెడికోలు
- సెమీ ఫైనల్స్‌కు ఏడు జట్లు



జీఎస్ఎల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో త్రోబాల్ పోటీల్లో తలపడుతున్న మహిళా మెడికోలు

రాజానగరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని మెడికల్, డెంటల్ కళాశాలల 25వ మహిళా గేమ్స్ మీట్ రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడాప్రాంగణంలో రెండో రోజైన బుధవారం హోరాహోరీగా సాగాయి. వైద్య విద్యార్థినులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా క్రీడాస్ఫూర్తితో సత్తా చాటుకునేందుకు పోటీపడు తున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ ఇత్రిమూర్తి రెండోరోజు క్రీడా పోటీల ఫలితాలను వెల్లడించారు. వివిధ క్రీడల్లో 10 జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కి, మరో 7జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరాయన్నారు.

త్రోబాల్ పోటీల్లో విజేతలు

త్రోబాల్ క్రీడా పోటీల్లో ఎస్వీ మెడికల్ కళాశాల(తిరుపతి) జట్టుపై జీఎస్ఎల్ మెడికల్ కళాశాల(రాజమహేంద్రవరం) జట్టు, గాయత్రి మెడికల్ కాలేజీ(విశాఖపట్నం)జట్టుపై కిమ్స్ డెంటల్ కళాశాల(అమలాపురం)జట్టు విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలు

బ్యాడ్మింటన్‌లో ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాల(నెల్లూరు) జట్టుపై జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు, అపోలో మెడికల్ కళాశాల జట్టుపై జీఎస్ఎల్ డెంటల్ కళాశాల జట్టు గెలిచి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు.

వాలీబాల్ పోటీల్లో విజేతలు

వాలీబాల్ పోటీల్లో ఎస్వీ మెడికల్ కళాశాల(తిరుపతి)జట్టుపై గుంటూరు మెడికల్ కళాశాల జట్టు, జీఎంసీ మెడికల్ కళాశాల జట్టు (కడప)పై ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల (విశాఖపట్నం) జట్టు, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల(గుంటూరు)పై పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల(గన్నవరం) జట్టు, కిమ్స్(అమలాపురం)జట్టుపై జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు, ఏసీఎస్ఆర్(నెల్లూరు) జట్టుపై ఆర్ఎంసీ(కాకినాడ) జట్టు, సెయింట్ జోసెఫ్ డెంటల్ (ఏలూరు)జట్టుపై ఆశ్రమ్(ఏలూరు) జట్టు విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్ చేరుకున్నాయి.

బాస్కెట్‌బాల్ పోటీల్లో..

బాస్కెట్‌బాల్ ఆర్ఎంసీ(కాకినాడ)జట్టుపై ఎన్ఆర్ఐ(గుంటూరు) జట్టు, జీఎస్ఎల్ డెంటల్ కళాశాల జట్టుపై మిమ్స్(విజయనగరం) జట్టు, సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల(ఏలూరు) జట్టుపై పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల జట్టు గెలిచి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో..

బాల్ బ్యాడ్మింటన్‌లో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల జట్టుపై సిద్ధార్థ మెడికల్ కళాశాల(విజయవాడ)జట్టు సెమీఫైనల్‌కు చేరాయి.

టేబుల్ టెన్నిస్‌లో పోటీల్లో..

టేబుల్ టెన్నిస్‌లో ఎన్ఆర్ఐ మెడికల్‌కళాశాల(విశాఖపట్నం) జట్టుపై జీఎస్ఎల్ మెడిక ల్ కళాశాల జట్టు, ఎస్వీ మెడికల్ కళాశాల (తిరుపతి)జట్టుపై జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు గెలిచి సెమీఫైనల్స్‌కు చేరుకున్నట్లు జీఎస్ఎల్ మెడికల్ కళాశాల పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

నన్నయ వీసీకి సుబ్బుకృష్ణ అవార్డు



సుబ్బుకృష్ణ స్మారక ఉత్తమ కమ్యూనిటీ భాషా శాస్త్రవేత్త అవార్డుతో నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూలై23(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకమైన ప్రొఫెసర్ ఆర్.సుబ్బుకృష్ణ స్మారక ఉత్తమ కమ్యూనిటీ భాషా శాస్త్రవేత్త అవార్డు 2025ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీకి ప్రదానం చేశారు. బుధవారం విశ్వవిద్యాలయం కాన్ఫరెన్స్‌హాల్‌లో వర్చువల్‌గా జరిగన కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం జరిగింది. మన దేశంలో గిరిజన భాషలు, లిపి అభివృద్ధికి ఆమె చేసిన అసాధారణ కృషికిగాను వీసీ ప్రసన్నశ్రీకి ఈ పురస్కారం లభించింది. దీన్ని డైరెక్టరేట్ ఆఫ్ రీజినల్ ఇండియన్ లాంగ్వేజస్ అండ్ రీసెర్చ్, మణిపూర్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, అపుంబా ఇరెయిపక్కి మహేయిరోయ్‌సి సిన్‌పాంగ్‌లుప్ కలిపి బుధవారం మణిపూర్‌లో నిర్వహించాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, అధ్యాపకులు ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, కె.రమణేశ్వరి పాల్గొన్నారు.

ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న గోదావరి ఉధృతి



కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

- 2.38 లక్షలు క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల

ధవళేశ్వరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ప్రశాంతంగా ప్రవహిస్తున్న గోదావరి ఎగువ ప్రాంతాల్లో విస్తారమైన వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి కలుస్తూ ఉండడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంవద్ద నీటిమట్టం పెరుగుతూ ఉండడంతో కాటన్ బ్యారేజ్ మొత్తం 175 గేట్లను అరమీటరు మేర పైకి ఎత్తి 2,38,886 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో బుధవారం సాయంత్రానికి ధవళేశ్వరంవద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. డెల్టా పరిధిలో కురుస్తున్న వర్షాల కారణంగా డెల్టా కాలువలకు సాగునీటి విడుదలను తగ్గించారు. తూర్పుడెల్టాకు 3,800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతూ బుధవారం సాయంత్రానికి 20 అడుగులకు చేరుకుంది.

కారం తమ్మన్న దొర వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి: ఆదివాసీ జేఏసీ

దేవీపట్నం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న తొలి మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు కారం తమ్మన్నదొర 145వ వర్ధంతి సందర్భంగా ఏపీ రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్ కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో 1857 తిరుగుబాటుకు ముందే కారం తమ్మన్నదొర బ్రిటిష్ వారిపై రంపచోడవరం కేంద్రంగా 1839 నుంచి 1847 వరకు రంప తిరుగుబాటు చేశారన్నారు. బ్రిటిష్‌వారిపై జరిపిన పోరాటంలో 1880,జూలై 25న వీరమరణం పొందారని, ఇంతటి చరిత్ర కలిగిన తమ్మన్నదొర వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.



శిక్షణ సామాగ్రి అందజేస్తున్న విజయకుమార్

వినూత్న సాంకేతికతతో శిక్షణ ఎంతో అవసరం

- రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్

దివాన్‌చెరువు,జూలై 23(ఆంధ్రజ్యోతి): అడవుల నిర్వహణ, వన్యప్రాణుల సంరక్షణలో తాజా వినూత్న సాంకేతికతలతో శిక్షణ ఎంతో అవసరమని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ బి.విజయకుమార్ అన్నారు. దివాన్‌చెరువు సమీపంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీలో 13వబ్యాచ్ అటవీ బీట్ అధికార్ల శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం అకాడమీలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ అటవీ, వన్యప్రాణుల నిర్వహణలో సమకాలీన సమస్యలు, వినూత్న సాంకేతికతలపై దృష్టిసారించేందుకు శిక్షణ దోహదపడుతుందన్నారు. కోర్సు డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 22అటవీ విభాగాలనుంచి 38మంది ఎఫ్‌బీవోలు శిక్షణకు హాజరయ్యారన్నారు.ఆరునెలలపాటు ఈశిక్షణ జరుగుతుందన్నారు.ఫ్యాకల్టీసభ్యులుశ్రీనివాసరావు, శ్రీహరిగోపాల్, శ్రీరామారావు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులే టార్గెట్

» పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి » సెంట్రల్ జైలులో ఎంపీ మిథున్‌తో ములాఖత్



జైలులో మిథున్‌రెడ్డిని కలిసి బయటకువస్తున్న పెద్దిరెడ్డి, వనిత, భరత్ రామ్

రాజమహేంద్రవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైసీపీ శ్రేణులను ముఖ్యంగా ప్రధాన భూమిక పోషించే నాయకులను టార్గెట్ చేసి అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్న ఆయన కుమారుడు, వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ములాఖత్ ద్వారా బుధవారం కలిశారు. ఆయన వెంట మాజీ హోం మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఉన్నారు. అనంతరం జైలు బయట మీడియాతో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులపై అనేక రకాల కేసులు పెడుతున్నారన్నారు. ఒక ప్రజాప్రతినిధికి ఇవ్వాల్సిన గౌరవాన్ని ప్రజాప్రతినిధులుగా ఉన్న చంద్రబాబు గానీ వారి మంత్రివర్గ సభ్యులు ఎందుకు విస్మరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వైసీపీ శ్రేణులు తప్పకుండా ఈ పరి స్థితిని అధిగమించి ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం తీసుకొనే చర్యలను ఖండిస్తున్నామన్నారు. మిథున్ రెడ్డి ఎలాంటి ఇబ్బంది అయినా ఎదుర్కొంటారని, సౌకర్యాలను కోరుకునే వ్యక్తి కాదన్నారు. న్యాయపరంగా కల్పించిన సదుపాయాలను కల్పించడం లేదని, కక్షపూరితంగా వ్యవహరిస్తున్నా రని ఆరోపించారు. మిథున్ బాగున్నారని, సంతోషంగా ఉన్నారని చెప్పారు. నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే న్యాయ స్థానాలనే ఆశ్రయిస్తామన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ధరలు పెంచడం ద్వారా మద్యాన్ని నియంత్రించామని తానే టి వనిత అన్నారు. మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్కాం జరిగిందని లేనిపోని నిందలు మోపుతున్నారన్నారు. భరత్‌రామ్ మాట్లాడుతూ మిథున్ రెడ్డిని అరెస్టు చేసి ప్రతిపక్షాల నోరు నొక్కుతున్నారన్నారు.

వైసీపీ శ్రేణుల హల్‌చల్

రామచంద్రారెడ్డి కారుకు ముందు ఉన్న కార్ల బయట నుంచొని వైసీపీ యువకులు హల్‌చల్ చేశారు. జైలు వద్ద ఒక అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలతో సహా సుమారు 100 మందితో బందో బస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ పర్యవేక్షించారు. రామచంద్రారెడ్డి వస్తున్న సమయంలో వైసీపీ యువకులు డివైడ్ దాటి జైలు వైపునకు దూసుకురావడం గమనించిన మురళీకృష్ణ ఒక్క ఉదుటున వెళ్లి వెనక్కి పంపేశారు. రామచంద్రారెడ్డి వెంట కారు మూరి నాగేశ్వరరావు, జక్కంపూడి రాజా, తోట త్రిమూర్తులు తదితర వైసీపీ నాయకులు రాగా.. నిబంధనల ప్రకారం జైలు బయటే పోలీసుల ఆపేశారు. దీంతో పోలీసులతో వాళ్ల వాగ్వాదానికి దిగారు. పోలీసులు అతికష్టంపై వాళ్లను రోడ్డు అవతలకు పంపేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ప్రిజన్ కేఫ్‌ని మూయించారు.


సెంట్రల్ జైలు బయట వైసీపీ శ్రేణులు

వీధి సుబ్రహ్మణ్యం హత్య వెనుక వైసీపీ పెద్దల హస్తం

త్వరలోనే అసలు విషయాలు బయటకు : టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సరిపల్లి రాజేష్


కాకినాడలో మాట్లాడుతున్న రాజేష్

కాకినాడ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటన వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందని, సిట్ విచారణలో త్వరలోనే అసలు విషయాలు బయటపడతాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సరిపల్లి (మహాసేన) రాజేష్ పేర్కొన్నారు. కాకినాడలో టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుబ్రహ్మణ్యం హత్యకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం వాస్తవాలను దాచిపెట్టిందన్నారు. ఈ విషయాన్ని రాజమండ్రిలో జరిగిన మహానాడు సభలో చంద్రబాబునాయుడు దృష్టికి దళిత నాయకులతో కలిసి తీసుకెళ్లామని, అధికారంలోకి రాగానే ఈ హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని కోరామన్నారు. దీంతో సుబ్రహ్మణ్యం హత్య కేసులో వాస్తవాలను వెలుగు తీసేందుకు కూటమి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ హత్య జరిగినప్పుడు పోలీసులు సమగ్ర విచారణ చేపట్టలేదన్నారు. హత్య జరిగిన సమయంలో జరిగిన ఘటనలు సెల్‌ఫోన్ టవర్లు, సీసీ కెమెరాల ఫుటేజ్‌ల ద్వారా త్వరలోనే బయటకు వస్తాయన్నారు. ఈ హత్య ఎమ్మెల్సీ అనంతబాబు ఒక్కరి వల్ల జరిగింది కాదని, దీని వెనుక కాకినాడ, రాజానగరం వైసీపీ నాయకుల అండదండలు ఉన్నాయన్నారు. సుబ్రహ్మణ్యం దగ్గర వైసీపీ నాయకుల అక్రమాలకు సంబంధించి బలమైన సాక్ష్యాధారాలు ఉన్నాయని, అవన్నీ బయట పడతాయనే హత్య చేశారని ఆయన ఆరోపించారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, మాజీ కార్పొరేటర్ పలివెల రవి అనంతకుమార్, బంగారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘువీర్

ద్రాక్షారామ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నవరత్నాల గరువురోడ్డులో ఇంట్లో చోరీకి పాల్పడిన ముగ్గురిని ద్రాక్షారామ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రామచంద్రపురంలో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను డీఎస్పీ రఘువీర్ వివరాలు వెల్లడించారు. నవరత్నాల గరువు రోడ్డులో ఉన్న తాతపూడి గోవిందు ఇంటి తాళం బద్దలుకొట్టి దొంగలు లోపలికి ప్రవేశించి 2 జతల వెండి పట్టీలు, రూ.5వేల నగదు అపహరించుకుపోయారు. దీనిపై ఈనెల 22న ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం మధ్యాహ్నం తాళ్లపొలం రైల్వే ట్రాక్ వద్ద కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన సిమ్మా మణికంఠ, నల్గొండ జిల్లా లక్ష్మీపురం తండాకు చెందిన ఆమ్‌గోతు బాబు, పాతర్లగడ్డ తండాకు చెందిన రమావత్ కోటేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 20 తులాల వెండి పట్టీలు, రూ.5వేలు నగదు, పల్సర్ మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసులో చురుకుగా వ్యవహరించిన హోంగార్డు వెంకటేష్‌ను సత్కరించారు. సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మోటారుసైకిళ్లు చోరీ

ఇద్దరికి రెండేళ్ల జైలు

కొవ్వూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై నేరం రుజువు కావడంతో 2 సంవత్సరాల జైలుశిక్ష విధించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన తెల్లంశెట్టి సాయిబార్గవ్, నేతల వివేక్ 2024లో కొవ్వూరులో 2 మోటారుసైకిళ్ల దొంగతనానికి పాల్పడ్డారు. దీనిపై అప్పటి ఎస్ఐ కె.జగన్మోహనరావు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. బుధవారం కొవ్వూరు రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రెండేళ్ల సాధారణ జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి తీర్పు చెప్పారు.

సహస్ర ఘటాభిషేకం

తునిరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం, విశేష పూజాది కార్యక్రమాలు పండితులు నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, సర్వతోబాద్రమండల దేవతా కలములతో కలశాలు ఏర్పాటు చేసి సప్తనదీ జలాలు ఉంచి వరుణ పూజా కార్యక్రమాలు చేశారు. పెద్దఎత్తున భక్తులు పూజలు ఆచరించారు.


లోవలో సహస్ర ఘటాభిషేకం దృశ్యం

దళితుడిపై అమానుష దాడి కేసులో..

ముగ్గురి అరెస్ట్, పరారీలో మరో ముగ్గురు : అమలాపురం డీఎస్పీ

అమలాపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): దళితుడిపై అమానుష దాడి కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఈ వివరాలను బుధవారం అమలాపురం టౌన్ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ విలేకర్లకు వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వెలువలపల్లికి చెందిన దళితుడు దోనిపాటి మహేశ్వరరావు అలియాస్ మహేష్ అమలాపురం రాయల్ కళాశాలలో పని చేసే విజయ్‌కుమార్ ద్వారా తుని పురపాలక సంఘంలో బిల్ కలెక్టర్‌గా పనిచేసే ఉద్యోగి సిరసపల్లి ఉదయ్‌శంకర్ అమలాపురం, ముమ్మిడివరం నగర పంచాయతీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తున్నాడని తెలిసి తనకు తెలిసిన వ్యక్తి కోసం రూ.2లక్షలు సొమ్ములు చెల్లించి రెండేళ్ల క్రితం మోసపోయాడు. దాంతో మహేష్ ఉదయ్‌శంకర్‌కు ఫోన్ చేసి డబ్బులు అడగగా కొంతమందికి కాన్ఫరెన్సు కాల్ కలుపుతాను. మా పెద్ద సార్‌లా మాట్లాడి వారం రోజుల్లో మీకు ఆర్డరు కాపీలు వచ్చేస్తాయని చెబితే చాలు అని మహేష్‌ను నమ్మించాడు. తద్వారా మిగిలిన సొమ్ములు వచ్చిన తరువాత మహేష్‌కు ఇవ్వాల్సిన మొత్తం ఇస్తానని మరోసారి నమ్మబలికాడు. ఈ తరహాలో మహేష్ పలుసార్లు కాన్ఫరెన్సు కాల్స్‌లో యల్లమిల్లి విజయ్, యర్రా కృష్ణ తదితరులతో మాట్లాడాడు.

సొమ్ముల కోసం చిత్రహింసలు..

ఉదయ్‌శంకర్‌కు ఉద్యోగాలు నిమిత్తం యల్లమిల్లి విజయ్ ద్వారా ఏడుగురు బాధితులు రూ.6.75లక్షలు చెల్లించారు. ఉదయ్‌శంకర్ మోసం చేశాడని తెలిసి ఈనెల 19వ బాధితులు ఉదయ్‌శంకర్, మహేష్‌ను రమ్మని పిలిచారు. మహేష్ తను గతంలో పనిచేసిన రాయల్ కళాశాలలో పనిచేస్తున్న విజయ్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు అధ్యాపకులను తీసుకుని 2మోటారు సైకిళ్లపై పేరూరు సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ యల్లమిల్లి విజయ్, ఉరదల బాలరాజు, యర్రా కృష్ణ, మరికొందరు కలిసి యర్రా కృష్ణ పేరూరులో అద్దెకు ఉంటున్న రేకుల షెడ్డు వద్దకు తీసుకువెళ్లారు. ఉదయ్‌శంకర్, మహేష్‌పై దాడిచేశారు. అక్కడికక్కడ రూ.3లక్షలు చెల్లించాలని నిర్బంధించారు. బోడసకుర్రులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి రబ్బరు ట్యూబు, కర్ర, కొబ్బరి మట్టలతో దాడి చేశారు. ఉదయ్‌శంకర్ స్వల్పంగా గాయపడ్డాడు. మహేష్‌పై అమానుషంగా దాడి చేశారు. బీరు బాటిల్ పగులకొట్టి పొడిచేందుకు, నదిలో తోసేసేందుకు ప్రయత్నం చేశారు. అలా రెండుమూడు చోట్లకు తీసుకెళ్లి మహేష్, ఉదయ్‌శంకర్‌లపై దాడి చేశారు. ఆ సమయంలో మహేష్ సోదరుడు 112కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. వెంటనే పట్టణ సీఐ పి.వీరబాబు తీవ్రంగా గాయపడ్డ దోనిపాటి మహేశ్వరరావును అమలాపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ పి.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. డీఎస్పీ ప్రసాద్ దర్యాప్తు చేసి కీలక ఆధారాలను సేకరించామన్నారు. ఈ కేసుకు సంబంధించి అమలాపురం శ్రీరామపురం ప్రాంతానికి చెందిన యల్లమిల్లి విజయ్‌రవిశంకర్, ఈదరపల్లి గ్రామానికి చెందిన ఉరదల బాలరాజు, విజయనగరం జిల్లా భోగాపురం ప్రాంతానికి చెందిన యర్రా కృష్ణను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి ఆటో, రబ్బరు ట్యూబులు, దాడికి ఉపయోగించిన ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో పరారైన ముగ్గురు నిందితుల కోసం బృందాలను నియమించినట్టు ఆయన తెలిపారు.

రేపటి నుంచి సత్యదేవుడి 135వ ఆవిర్భావ వేడుకలు

అన్నవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆవిర్భావ దినోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. స్వామివారు ఖరనామసంవత్సర శ్రావణ శుద్ధ విదియరోజున (1891 ఆగస్టు 6న) స్వయంభువుడుగా వెలిశారు. దీంతో ఏటా శ్రావణశుద్ధ పాడ్యమి, విదియ తిదులలో రెండురోజులు పాటు విశేషపూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తుంది. స్వామి 135వ ఆవిర్భావ దినోత్సవాలు పురస్కరించుకుని

2 రోజులపాటు విశేష పూజలు

శుక్రవారం ఉదయం 9గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన దీక్షా వస్త్రధారణ, తదితర కార్యక్రమాలతో పాటుగా హోమాలు, జపములు, పారాయణలు నిర్వహిస్తారు. శనివారం మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, ఆయుష్యహోమం నిర్వహించి రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమాలకు భక్తులు విచ్చేసి జయప్రదం చేయాలని ఈవో సుబ్బారావు కోరారు.

ఒకేసారి ఐదు స్వర్ణ పతకాలు

ఎన్జీ రంగా యూనివర్శిటీ స్నాతకోత్సవంలో అందుకోనున్న జ్వాల


మోర్త జ్వాల

అమలాపురం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం నల్లమిల్లికి చెందిన మోర్త జ్వాల ఒకేసారి ఐదు స్వర్ణ పతకాలు సాధించింది. ఎన్జీ రంగా యూనివర్శిటీలో 2023 బ్యాచ్‌కు చెందిన జ్వాల బీఎస్సీ అగ్రికల్చర్ ఆనర్స్ చదివింది. అప్పట్లో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచిన జ్వాలకు ఒకేసారి ఐదు స్వర్ణ పతకాలు అందజేయనున్నట్టు యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు లేఖ పంపించడంతో ఆ ఇంట ఆనందానికి అవధుల్లేవు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవాన్ని గురువారం విజయవాడ సమీపంలోని ఆత్కూరు స్వర్ణభారతి ట్రస్టులో నిర్వహించనున్నారు. యూనివర్శిటీ కాన్వొకేషన్‌లో భాగంగా జ్వాలకు శ్రీనీలంరాజు గంగాప్రసాదరావు అండ్ కమల గోల్డ్ మెడల్, శ్రీపరిశాయానాది మెమోరియల్ గోల్డ్ మెడల్, మణిమట్లపూడి మెమోరియల్ గోల్డ్‌మెడల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గోల్డ్‌మెడల్, శ్రీరాజా ఇమ్మానియేల్‌రాయల్ కొండేటి గోల్డ్‌మెడల్‌ను అందించనున్నారు. 57వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ హాజరుకానున్నారని, ఆయన చేతులమీదుగా జ్వాల స్వర్ణ పతకాలను అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తండ్రి మోర్త శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం జ్వాల బెంగుళూరు ఐఐఎంలో చదువుకుంటుంది. ఆమె స్నాతకోత్సవానికి హాజరుకానున్నట్టు తండ్రి తెలిపారు.

గోర్సలో గ్రామస్తుల ఆందోళన

దేవాలయ భూముల్లో ఆక్రమణదారులు సాగు చేయడానికి వీలులేదని బైఠాయింపు


కాకినాడ జిల్లా గోర్స దేవాలయం భూమిలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్స గ్రామంలోని సీతారామస్వామి ఆలయ భూములను ఆక్రమణదారులు సాగు చేయడానికి వీలులేదని దేవదాయశాఖ అధికారులు న్యాయస్థానం నుంచి స్టే తెచ్చారు. స్టే ఆర్డర్‌ను లెక్కచేయకుండా సీతారామస్వామి ఆలయ భూములను ఆక్రమించిన పలువురు కౌలు రైతులు బుధవారం ఆలయ భూముల్లో వరినాట్లు వేసేందుకు సమాయత్తం మయ్యారు. గ్రామానికి చెందిన శ్రీసీతారామస్వామికి చెందిన సర్వే నంబరు 121, 122లో 19 ఎకరాల 92 సెంట్లు భూమిని ఆక్రమణదారులు సాగు చేయడం దానిపై దేవదాయశాఖ అధికారులు ఆ భూమి దేవాలయానికి చెందినదే అని న్యాయస్థానంలో కేసులు వేయడం విధితమే. దీనిలో భాగంగా న్యాయస్థానం దేవాలయానికి చెందిన భూముల్లో ఎవరూ సాగుచేయరాదని స్టే విధించడం, దాన్ని ఖతరు చేయకుండా ఆక్రమణదారులు సాగు చేయాడానికి ప్రయత్నించడంతో గ్రామస్తులు పొలాల మధ్యలో ఆలయ భూములున్న చోట బైఠాయించి ఆందోళన చేపట్టారు. సీతారామస్వామి ఆలయానికి చెందిన భూములని అన్ని ఆధారాలున్నా సంబంధిత అధికారులు పట్టించుకో వడంలేదని, ఈ విషయమై ఉప ముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి దేవాలయ భూములను ఆక్రమణదారుల చెర నుంచి విడుదల చేయించాలని గ్రామస్తులు కోరారు. విషయం తెలుసుకున్న కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ సిబ్బందితో ఆందోళన చేస్తున్న ప్రాంతానికి వెళ్లారు. గ్రామస్తులు, ఆక్రమణదారులతో చర్చించారు. దేవాలయ భూముల్లోకి అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించరాదని నచ్చచెప్పి ఆందోళన విరమింపచేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

మూడేళ్ల బాలుడి మృతి కేసులో...
అంగన్వాడీ కార్యకర్త, ఆయాకు జైలు శిక్ష

కాట్రేనికోన, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మూడేళ్ల బాలుడు పంటకాల్వలో పడి మరణించిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. కాట్రేనికోన ఎస్ఐ అవినాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ మొక్కలతిప్పలో 2019లో అంగన్వాడీ కేంద్రంలో మూడేళ్ల బాలుడు పక్కనే ఉన్న పంటకాల్వలో పడి చనిపోయాడు. అప్పట్లో అంగన్వాడీ కార్యకర్త వెంట్రు శ్రీరమణ, ఆయా రేవు నాగమణిపై కేసు నమోదైంది. కేసులో వాదోపవాదాలు పూర్తయిన అనంతరం బుధవారం ముమ్మిడివరం జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి మహ్మద్ రెహ్మతుల్లా తీర్పు వెలువరించారు. నిందితులు ఒక్కొక్కరికి ఏడాది జైలు, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. అప్పట్లో ఈ కేసును ఎస్ఐ పి.సత్యనారాయణరెడ్డి దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన ఏపీపీ దాసరి నాగరాజు వాదనలు వినిపించారు.


విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థల సహకారం అవసరం : వీసీ



నన్నయ విశ్వవిద్యాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థిరమైనభూగర్భజల నిర్వహణను నిర్ధారించడానికి విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థల మధ్య శాస్త్రీయ, సమాజ ఆధారిత సహకారాలు అవసరమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. హైదరాబాద్‌లోని కేంద్ర భూగర్భజలబోర్డు దక్షిణ ప్రాంతం వారు టైర్2 శిక్షణా కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రాంభించారు. జిల్లాలో భూగర్భజలాల స్థిరమైన నిర్వహణ అనే అంశంపై 3రోజుల శిక్షణా కార్యక్రమాన్ని వీసీ ప్రాంభించారు. ఆమె మాట్లాడుతూ కాలుష్యం, కాలానుగుణ వైవిధ్యం వంటి పునరావృత సమస్యలను తెలిపారు. ఈ ప్రాంతంలో నీటిసంరక్షణ కీలకమైన అవసరాన్ని వివరించారు. సంప్రదాయ గిరిజన నీటి పద్ధతులను ప్రస్తావించారు. కేంద్ర భూగర్భ జలబోర్డు ప్రాంతీయ డైరెక్టర్ జ్యోతికుమార్ మన రాష్ట్ర భూగర్భజల స్థితిగతులు, కేంద్రభూగర్భజలమండలి వంటి విషయాలను వివరించారు. డిప్యూటీ డైరెక్టర్ వై.శ్రీనివాస్ తూర్పుగోదావరి జిల్లా భూగర్భజలాల పరిస్థితులను విశ్లేషించారు. భూగర్భజలాల శాస్త్రవేత్త డాక్టర్ ఎం.సుధీర్ కుమార్ ప్రాథమిక భూగర్భజలాల పరిస్థితులను వివరించారు. నన్నయ విశ్వవిద్యాలయం భూగర్భ జలన్వేషణ, రీచార్జ్ పద్ధతులు అనే నివేదిక పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. నన్నయ విశ్వవిద్యాలయం జియోసైన్స్‌ విభాగాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాలోని పలు కళాశాలల నుంచి జియాలజీ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు టి.మాధవ్, పి. రేష్మా, పి.యాదయ్య, ఎస్.సరిత. టి.వెంకటగిరి, డి.అనంతరావు, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, జియోసైన్స్‌ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, అధ్యాపకులు నూకరత్నం, కె.ఎస్.పీటర్, కె.సుధారాణి ఉన్నారు.

'కేబుల్ వ్యవస్థలో పెరిగిన ధరలు తగ్గించాలి'


రావులపాలెంలో మాట్లాడుతున్న రమ్మి సురేష్

రావులపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేబుల్ వ్యవస్థలో పెరిగిన ధరలు వెంటనే తగ్గించాలని, ఇది ఉమ్మడి జిల్లాలోని మండల స్థాయి ఆపరేటర్స్ ఐక్యతగా ఉండటం ద్వారానే సాధించుకోవచ్చని మల్టీసర్వీసెస్ కేబుల్ ఆపరేటర్స్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు అన్నారు. కోనసీమ జిల్లా రావులపాలెంలో జిల్లా అధ్యక్షుడు కర్రి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కన్వీనర్ రమ్మి సురేష్, వెంకట్రావు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని మండల ఇన్‌చార్జ్‌లు చానల్ రేట్లు దిగి రావడం కోసం నిరసన వ్యక్తం చేయడం ఆనందదాయకమన్నారు. యూనియన్ పిలుపు మేరకు త్వరలో ఎంఎస్వోలు, బ్రాడ్‌కాస్టర్లు రేట్లు తగ్గించకపోతే సమష్టిగా పోరాటం చేసి రేట్లు తగ్గించే వరకూ నిరసన వ్య క్తం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం అమలు చేసిన విధానాలతో ఆపరేటర్లు తీవ్రంగా నష్టపోయారని దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ ఎం.లక్ష్మిప్రసాద్, కోశాధికారి డి.గోవిందరాయులు, మండల ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

పెద్దాపురంలో వ్యభిచారగృహ నిర్వాహకురాలికి సహకారం
కానిస్టేబుల్, హోంగార్డ్ సస్పెన్షన్

ఎస్ఐ, పోలీస్ అధికారులపై క్రమశిక్షణా చర్యలకు కాకినాడ జిల్లా ఎస్పీ సిఫార్సు

కాకినాడ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలో వ్యభిచారగృహ నిర్వాహకురాలికి సహకరించారనే అభియోగం విచారణలో నిగ్గు తేలడంతో కానిస్టేబుల్, హోంగార్డ్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దాపురంలో వ్యభిచారగృహంలో విటులు దొరికినా పట్టుకోకుండా నిర్వాహకురాలు భారతికి స్థానిక పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ జి.శివరామకృష్ణ, హోంగార్డ్ సీహెచ్.శివకృష్ణ సహకరిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు శాఖాపరంగా విచారణ చేపట్టిన దర్యాప్తు అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా కానిస్టేబుల్, హోంగార్డ్‌ను ఎస్పీ సస్పెండ్ చేశారు. అలాగే పెద్దాపురం ఎస్ఐ వి.మౌనికపై క్రమశిక్షణా చర్యలు, అలాగే మరికొంతమంది పెద్దాపురం సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులపై క్రమశిక్షణా చర్యలకు ఉన్నతాధికారులకు ఎస్పీ సిఫార్సు చేశారు. పెద్దాపురం పరిసర ప్రాంతాల్లో వ్యభిచారం జరగకుండా నిరంతర దాడులు చేయడం జరుగుతుందని ఎస్పీ విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

వ్యభిచార గృహాలపై దాడి

పెద్దాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో వ్యభిచార గృహాలపై పోలీసులు బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. పెద్దాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేటకు చెందిన పోలీసులు అధికారుల బృందం స్థానిక మసీదు సెంటర్, వక్కలంకవారి వీధిలో ఈ దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో సందిగిరి దుర్గ, ప్రత్తిపాటి జీవన్‌ను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. వ్యభిచార గృహాలు నిర్వహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. దాడుల్లో సీఐ విజయశంకర్, ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

కోర్టులో హాజరైన జనసేన నేతలు


కాకినాడలో కోర్టులో హాజరయ్యేందుకు వెళ్తున్న జనసేన నేతలు

కాకినాడ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబుతో పాటు జనసేన నాయకులు బుధవారం కాకినాడ రెండో అదనపు జూనియర్ సివిల్ కోర్టులో వాయిదాకు హాజరయ్యారు. వివరాల్లోకి వెళితే వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో కాకినాడ భానుగుడి కూడలిలో జనసేన నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుండగా పోలీసులు అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేసి కోర్టులో హాజరుపర్చారు. అప్పటి నుంచి జనసేన నేతలు కోర్టు వాయిదాలకు హాజరవుతున్నారు. అందులో భాగంగా బుధవారం కోర్టుకు హాజరయ్యారు.

మున్సిపాల్టీ సొమ్ములు వాడుకున్న ఉద్యోగిని అరెస్టు

భర్తను పట్టుకున్న పోలీసులు

తునిరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీకి పన్నుల రూపంలో వచ్చిన సొమ్ములు వాడుకున్న ఉద్యోగిని బుధవారం తుని పోలీసులు అరెస్టు చేశారు. తుని టౌన్ సీఐ గీతారామకృష్ణ వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తుని టౌన్ మున్సిపాల్ కమిషనర్ కార్యాలయంలో క్లర్కుగా పనిచేస్తున్న మంగు సునీత 2024 డిసెంబరు నుంచి 2025 ఏప్రిల్ వరకు మున్సిపాల్టీకి చెందిన వివిధ రకాల పన్నుల రూపంలో వసూలు చేసిన సుమారు రూ.26లక్షలకు పైగా సొంతంగా వాడుకుంది. దీనిపై ఫిర్యాదు రావడంతో ఆమెపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బుధవారం సునీత, భర్త విశ్వనాథను అరెస్టు చేశారు. సునీత చేసిన అప్పులు తీర్చుకోవడానికి, భర్త రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సొమ్ములు వాడుకున్నట్టు తెలిపారు. విశ్వనాథ పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్నామని, ఈ కేసులో విచారణ కొనసాగుతుందని సీఐ తెలిపారు.

గుమ్మడికాయల మాటున గోవుల అక్రమ తరలింపు

డ్రైవర్‌పై కేసు

జగ్గంపేట/కిర్లంపూడి, జూలై 23(ఆంధ్రజ్యోతి): గుమ్మడికాయల మూటల మాటున గోవులను ఉంచి అక్రమంగా తరలిస్తుండగా కిర్లంపూడి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని కృష్ణవరం టోల్‌గేట్ వద్ద కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ఉన్న గుమ్మడికాయల లోడు వ్యాన్‌ను పరిశీలించారు. వ్యాన్ కింద ఒక అర ఏర్పాటు చేసి గోవులను ఉంచినట్టు గుర్తించారు. గుమ్మడికాయలు మూటలు కిందకు దించి చూడగా అందులో 2 గోవులు, 8 ఎద్దులు ఉన్నాయి. వాటిని వ్యాన్‌తో పాటు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి 'శ్రీచైతన్య' రూ.లక్ష విరాళం

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో వచ్చే నెలలో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంటు నిర్వహణకు కాకినాడ శ్రీచైతన్య కళాశాల తరపున రూ.50వేలు, శ్రీచైతన్య పాఠశాల తరపున రూ.50వేలు విరాళాలను కలెక్టర్ షాన్‌మోహన్‌కు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాల కాకినాడ జోన్ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం హరిప్రసాద్, పాఠశాల ఏజీఎం సురేష్, ఆర్ఐ గోపీనాథ్ పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

కాకినాడ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గ్రీన్ టాక్స్ తగ్గించి వాహనదారులకు ఊరట కలిగించిన నేపథ్యంలో కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్, మోటారు లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చీడీల పొర కమ్యూనిటీ హాల్లో సీఎం చంద్రబాబు చిత్రపటానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాలాభిషేకం చేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడవల్లి మృత్యుంజయరావు, కార్యదర్శి అల్లం రాజు, కోశాధికారి గణేషుల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు, మోటారు లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎలిపే శ్రీను, ప్రధాన కార్యదర్శి మట్ట చిన్ని, కోశాధికారి పైల వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కొంగోడులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు

'ఇంటింటికీ సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయం'

కరప, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు పేర్కొన్నారు. మండలంలోని నడకుదురు, గొర్రిపూడి, కొంగోడు, పెనుగుదురు గ్రామాల్లో బుధవారం వారు టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారిని, మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకులు బుంగా సింహాద్రి, పులపకూర మహేష్, యాసలపు విష్ణు, అట్ల గంగరాజు, మేడిశెట్టి పట్టాభి, పలివెల జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.



రూ.లక్ష నగదు, నోటు పుస్తకాలు అందజేస్తున్న దాత పవన్

చిన్నారుల విద్యాభ్యాసానికి రూ.లక్ష అందజేత

కాకినాడ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అల్లుడు తోట పవన్ తన పుట్టినరోజు సందర్భంగా చిన్నారుల విద్యాభ్యాసం కోసం శ్రీయువసేన సహాయ నిధికి రూ.లక్ష సాయం ప్రకటించారు. మెయిన్‌రోడ్‌లోని శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌లో అధ్యక్షుడు బొల్లం సతీష్ ఆధ్వర్యంలో కేట్ కటింగ్ అనంతరం పవన్ రూ.లక్ష నగదు అందజేశారు. ముత్తానగర్ మున్సిపల్ స్కూల్లో 50 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. లారీ యజమానుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దుగ్గన బాబ్జీ, ర్యాలి సతీష్, వసంత, అగ్రహారపు సతీష్‌నాయుడు, ముమ్మిడి స్వరూప్, మావులూరి రాగిణి సురేష్, నాయుడు, శ్రీయువసేన సభ్యులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'

గొల్లప్రోలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ విల్సన్ ఆదేశించారు. గొల్లప్రోలులోని రూరల్ పీహెచ్‌సీని ఆయన బుధవారం తనిఖీ చేసి ల్యాబ్‌లో టెస్టుల కిట్లు, రోగుల వివరాలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో డెంగ్యూ, మలేరియా జ్వరాలు పూర్తిగా అదుపులో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 65 డెంగ్యూ కేసులు నమోదు కాగా, వారు రికవరీ అయి పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని చెప్పారు. డెంగ్యూ టెస్టింగ్ కిట్లు కాకినాడ ప్రభుత్వాసుపత్రితో పాటు తుని ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆరు నెలల క్రితం ఒక మలేరియా పాజిటివ్ కేసు వచ్చిందని, తర్వాత ఎటువంటి కేసులు రాలేదని చెప్పారు. పీహెచ్‌సీ డాక్టర్ సునీతమెర్సీ, హెచ్‌ఎస్ బాషా, హెచ్‌వీ రజనీ పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి సాగునీటి ఇబ్బందులు: మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కాలువల్లో పూడిక తొలగించకపోవడం వలన పిఠాపురం మండలం వెల్దుర్తి, పి.దొంతమూరు గ్రామాల్లో సింహాద్రిరాజు కాలువ ద్వారా నీరు రాక రైతులు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. కిర్లంపూడి సెక్షన్ పరిధిలో పెండింగ్ ఉన్న పనులను తక్షణం నిర్వహించే లా చూడాలని కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని రైతులకు తెలిపారు. పిఠాపురంతో పాటు వెల్దుర్తి. పి.దొంతమూరు గ్రామాల్లో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పలువురు రైతులు సాగునీటి ఇబ్బందులను వర్మ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వున్నారు.

'తిమ్మాపురంలో పీ4 రీ సర్వే చేపట్టాలి'

సర్పవరం జంక్షన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో భాగంగా తిమ్మాపురంలో పీ4 సర్వే నిర్వహించారు. అనర్హులను లబ్ధిదారులుగా చేర్చారని, తక్షణం రీ సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని జనసేన నాయకులు మాదారపు తాతాజీ, బత్తుల దొరబాబు డిమాండ్ చేశారు. బుధవారం తిమ్మాపురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో పీ4 లబ్ధిదారుల వివరాలను కార్యదర్శి రామం వివరించారు. గ్రామంలో 288 మందిని పీ4 సర్వేలో లబ్ధిదారులుగా సచివాలయ సిబ్బంది గుర్తించినట్టు తెలిపారు. పలు పేర్లను చదివి వినిపించగా జనసేన నాయకులు తాతాజీ, దొరబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. పీ4 సర్వే లోపభూయిష్టంగా జరిగిందని, నిరుపేదలను గుర్తించకుండా సొంత భూమి, రెండస్తుల భవనాలు ఉన్న వారిని ఎంపిక చేశారన్నారు.



చంద్రశేఖర్ అజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ

ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో ఆజాద్, తిలక్ జయంతి

సర్పవరం జంక్షన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురంలోని అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో చంద్రశేఖర్ అజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి... 39వ డివిజన్‌లో ఎమ్మెల్యేతో కలిసి పర్యటన

కాకినాడ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందని, కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు సానుకూలంగా ఉన్నారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలు శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 39వ డివిజన్‌లో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ మల్లిపూడి నాగ సూర్యదీపిక-వీరు అధ్యక్షతన బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, నియోజకవర్గ పరిశీలకుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. చీడీలపొరలో రోడ్డుపై చీరలు పరిచి పూలు జల్లుతూ మంత్రికి మహిళలు స్వాగతం పలికారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, మహిళలకు కుట్టుమిషన్లు, బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి రూ.7 లక్షల చెక్కుల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మాజీ మేయర్ సుంకర పావని-తిరుమలకుమార్, నాయకులు గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, తుమ్మల సునీత, కొల్లాబత్తుల అప్పారావు, పంతాడి రాజు, వుండవల్లి వీర్రాజు, ఏపీడీ మెంటారావు, ఎండీ ఖాన్, పలివెల రవిఅనంతకుమార్, చింతా పేర్రాజు, చింతలపూడి రవి, ఎరిపిల్లి రాము, పెనుపోతు జీవరత్నం, ఓలేటి పాండురంగ, పాలెపు రాజు, దేవ జయలక్ష్మి, పట్టా ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



39వ డివిజన్‌లో పర్యటిస్తున్న మంత్రి రాంప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే కొండబాబు



గొల్లప్రోలు సొసైటీ అధ్యక్షుడిగా ఎంపికైన గుండ్ర సుబ్బారావు తదితరులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

'రైతులకు నిస్వార్థంగా సేవలు అందించాలి'

గొల్లప్రోలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు నిస్వార్థంగా సేవలు అందించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. కూటమి పార్టీల మధ్య పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీకి కేటాయించిన గొల్లప్రోలు సొసైటీకి అధ్యక్షుడిగా గుండ్ర సుబ్బారావు, చేబ్రోలు సొసైటీ అధ్యక్షుడిగా మల్లిపూడి వీరబాబులను ఎంపిక చేశారు. బుధవారం వారిని వర్మ అభినందించారు. 12 సొసైటీల్లో నాలుగింటిని టీడీపీకి కేటాయించారని వర్మ తెలిపారు.



పెదపూడి మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

'ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి'

పెదపూడి (కరప), జూలై 23 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. పెదపూడి మండల కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో మంచిపేరు వచ్చేలా అధికారులు వ్యవహరించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, మౌలిక సదుపాయల కల్పనకు పెద్దపీట వేయాలన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులు తమ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సభ్యులకు వివరించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎంపీపీ కేతా తులసి, జడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపీడీవో నరేంద్ర రెడ్డి, తహసీల్దారు సీతాపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'హరిహర వీరమల్లు' సంబరాలు

పిఠాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఆయన నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదల సందర్భంగా జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు సంబరాలు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాదగయ సెంటర్ నుంచి పుర వీధుల మీదుగా మోటారు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం సినిమా ప్రీమియర్ షో వేసిన వెంకటేశ్వర థియేటర్ వద్ద కేక్ కట్ చేసి అక్కడ జరిగిన సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం సినిమాను వీక్షించారు. గొల్లప్రోలులోనూ జనసేన నాయకులు సంబరాలు జరిపారు.

హరిహర వీరమల్లు చిత్రం విజయవంతం కావాలంటూ జనసేన నాయకుడు, జనసేవా సంఘం వ్యవస్థాపకుడు కరణం సూరిబాబు పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. పాదగయ ఆవరణలో పొర్లుదండాలు పెట్టి మోకాళ్లపై ప్రదక్షిణ చేశారు. పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.



పిఠాపురంలో కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు, ఆ పార్టీ నేతలు



కేంద్ర చమురు, సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి హర్దీప్ సింగ్‌కు లేఖ అందజేస్తున్న ఎంపీ సతీష్‌బాబు

ఎంపీ సతీష్‌బాబు కృషితో రూ.48 కోట్లు విలువైన క్యాన్సర్ చికిత్స పరికరాలు

కాకినాడ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు బుధవారం ఢిల్లీలో కేంద్ర చమురు, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో రాష్ట్రానికి క్యాన్సర్ వ్యాధిపై పోరాటంలో సహకారంగా ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధుల నుంచి మూడు రేడియేషన్ మిషన్లను సమకూర్చే విషయమై చర్చ జరిగింది. ఒక్కొక్కటి రూ.16కోట్లు కాగా, మొత్తం రూ.48 కోట్లు విలువైన క్యాన్సర్ చికిత్స పరికరాలు అందించేందుకు ఓఎన్జీసీ అంగీకరించింది. ఈ అత్యాధునిక పరికరాలను త్వరలో కాకినాడ, గంటూరు, కడప జిల్లాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయనున్నారు.



కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నూతన కార్యవర్గం

కార్మిక సంఘాల సమాఖ్య కార్యవర్గ ఎన్నిక

పిఠాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మడికి సత్యం, కుంచే అంజిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పిఠాపురంలో జరిగిన ఉమ్మడి జిల్లా మహాసభలో జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల వివరాలను బుధవారం వెల్లడించారు. ఉపాధ్యక్షుడిగా డి.నారాయణమూర్తి, సహాయ కార్యదర్శిగా కె.జోజి, కోశాధికారిగా డాన్ శ్రీను, కార్యవర్గ సభ్యులుగా గుడాల చార్లెస్, బొచ్చా ఏసు, తిరుమలశెట్టి వెంకటరమణ, చింతపల్లి రత్నం, కొల్లి రాంబాబు, రాయుడు గోవింద ఎన్నికయ్యారని రాష్ట్ర అధ్యక్షుడు కరీం బాషా తెలిపారు.



కొండెవరం నుంచి బదిలీ అయిన సచివాలయ సిబ్బందిని సత్కరిస్తున్న పంచాయతీ సిబ్బంది

బదిలీ అయిన సిబ్బందికి వీడ్కోలు

కొత్తపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొండెవరం గ్రామ సచివాలయంలో పనిచేస్తూ బదిలీపై వేరేచోటుకు వెళ్లిన 8మంది సచివాలయ సిబ్బందిని కూటమి నాయకులు బుధవారం సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరుద్ర సహిత నవ గ్రహ యాగం

సామర్లకోట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరిహర క్షేత్రం అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరాలయంలో 11 రోజులు జరిగిన శ్రీరుద్ర సహిత నవగ్రహ యాగం బుధవారం ముగిసింది. యాగ నిర్వాహకుడు, ఆలయ వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామి ఆధ్వర్యంలో పూర్ణాహుతి అనంతరం పండిత సత్కారం, వేదస్వస్తి, ప్రసాద వితరణతో పాటు మహాన్నదానం నిర్వహించారు. పూజల అనంతరం దేవతామూర్తులను నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

జనసేన నాయకుడు రాజశేఖర్ అకస్మిక మృతి



సామర్లకోట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జనసేన పెద్దాపురం నియోజకవర్గ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త బిక్కిన రాజశేఖర్ బుధవారం సాయంత్రం కాకినాడ ఆసుపత్రిలో అకస్మికంగా మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సామర్లకోటలో కార్యక్రమాలను అర్ధంతరంగా నిలిపివేసి టీడీపీ నాయకులతో కలిసి రాజశేఖర్ ఇంటికి చేరుకున్నారు. రాజశేఖర్ తండ్రి సాయి పరమేశ్వరరావు, కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రాజశేఖర్ మృతికి టీడీపీ, జనసేన నాయకులు తీవ్ర సంతాపం తెలిపారు.



కాయగూరలతో అలంకరించిన బాలాత్రిపురసుందరి

శాకంబరిగా బాలాత్రిపురసుందరి

తాళ్లరేవు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత కోరింగలో వేంచేసియున్న కురంగేశ్వరస్వామి దేవాలయంలో కురంగేశ్వరస్వామికి మాస శివరాత్రి సందర్భంగా లక్ష రుద్రాక్ష పూజ, ఆషాడ మాసం సందర్భంగా బాలాత్రిపురసుందరి అమ్మవారికి కుంకుమ పూజ, శాకంబరీ అలంకరణ జరిపారు. అర్చకుడు కొత్తలంక సాయిప్రసాద్ పూజలు జరపగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు సేవలు అందించారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురంలో సత్తెమ్మ అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకురాలు రెడ్డిపల్లి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో దాత, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణను కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించారు. భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి ప్రసాద వితరణ గావించారు. నల్లా చక్రధర్ (బుల్లియ్య) తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

పిఠాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ తదితర విభాగాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్ల వేతనాలు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు వారు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావును కలిసి పవన్‌కు తమ తరపున కృతజ్ఞతలు తెలియజేయాలని కోరారు.

సావిత్రి నేత్ర దానం



తాళ్లరేవు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం గ్రామానికి చెందిన అందే సావిత్రి (62) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆమె నేత్రాలను కుటుంబసభ్యుల అంగీకారంతో కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. సిబ్బంది కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. సావిత్రి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

పట్టుగూళ్ల నాణ్యతపై దృష్టి పెట్టాలి

గొల్లప్రోలు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టుగూళ్ల నాణ్యతపై రైతులు దృష్టి సారించాలని జిల్లా సెరీకల్చర్ అధికారి పాల్ రాజు, సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త భువనేశ్వరి సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పట్టు పరిశ్రమ కేంద్రంలో బుధవారం జరిగిన రైతు సదస్సులో వారు మాట్లాడారు. మల్బరీ సాగులో నూతన పద్ధతులు, పట్టుగూళ్ల షెడ్లలో ఉష్ణోగ్రత, తేమ శాతాల నిర్వహణ తదితర అంశాలను వివరించారు. చేబ్రోలు సెరీకల్చర్ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బధిరుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాంబమూర్తినగర్‌లో ఉన్న ప్రభుత్వ బధిరుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26 సంవత్సరానికి గాను బధిర విద్యార్థినీ, విద్యార్థులు ఇక్కడే వసతిగృహంలో ఉండేందుకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. జిల్లాలోని బధిర, విభిన్న ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఇతర వివరాలకు 0884-2352303 నెంబరును సంప్రదించాలన్నారు.

మహా సంస్థానంలో హుండీల లెక్కింపు

పిఠాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. మార్చి 19 నుంచి జూలై 23 వరకు రూ.17,82,86 ఆదాయం లభించింది. లెక్కింపులో దేవదాయ శాఖ జిల్లా అధికారి కె.నాగేశ్వరరావు, తనిఖీదారు వి.ఫణీంద్రకుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య పాల్గొన్నారు.





లోకేశ్‌ను కలిసిన నెహ్రూ, వీరబాబు

కిర్లంపూడి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పలు విషయాలపై చర్చించారు. అలాగే ఎమ్మెల్యేతో పాటు కిర్లంపూడి మండలానికి చెందిన ఏలేరు ప్రాజెక్టు ఛైర్మన్ బస్వా వీరబాబు మంత్రిని కలిశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే శిరీషదేవి



కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మండలంలోని ఉసిరిజొన్నల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగాగ్రామస్తులనుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసాఇచ్చారు. టీడీపీ నాయకులు అడబాల బాపిరాజు, పెంటపాటి అనంతమోహన్, మండేశ్వరరావు, రాజేంద్ర వరప్రసాద్, సింహాచలం, సిద్ధా వెంకన్న,పండాబాబి, రమణకుమార్,మీరా, కుంజం బాపన్నదొర,నాగన్నదొర, వెంకటేశ్వరరావు, చెల్లెమ్మ, నూకరాజు, బీజేపీ నేత బుల్లికొండలుదొర పాల్గొన్నారు.

చింతూరులో గ్రీవెన్స్‌కు 40 వినతులు

చింతూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏలో బుధవారం గ్రీవెన్సు జరిగింది. చింతూరు డివిజన్ పరిధిలోని పలువురు బాధితులు వారి సమస్యలను విన్నవించుకున్నారు. వీటిలో ఆర్అండ్ఆర్ సమస్యలు 26, భూతగాదా సమస్యలు 4, ఇతర సమస్యలు 18 ఉన్నాయి. వినతులు పరిశీలించిన ఐటీడీఏ ఏపీఓ జగన్నాథరావు సత్వరంగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

'పునరావాస ప్రక్రియలో అలసత్వం నివారించండి'

పునరావాస ప్రక్రియలో అధికార యంత్రాంగం అలసత్వం వీడాలని బీజేపీ జిల్లా నాయకుడు పాయం వెంకయ్య, సీనియర్ నాయకుడు డీవీఎస్ రమణారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన చింతూరు ఐటీడీఏ గ్రీవెన్సులో ఏపీవో జగన్నాథరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 41.5 కాంటూరు స్థాయిలో నీటమునగనున్న గ్రామాల నిర్వాసితులకు, పరిహారం, పునరావాసం కల్పించాలని కేంద్రం రూ.2,200 కోట్లు కేటాయించినా ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం విడ్డూరమన్నారు.

'ఆపద సమయంలో శక్తియాప్ ఉపయోగించండి'

మోతుగూడెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని గూడూరు పంచాయతీ, తూలగొండ పాఠశాలలో బుధవారం శక్తి యాప్‌ను ఉపయోగించుకుని ఆపద నుంచి గట్టెక్కాలని మోతుగూడెం ఎస్ఐ సాధిక్ విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ 'ఓ యువత మేలుకో-జీవితాన్ని నిలుపుకో' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల జోలికి ఎవరూ వెళ్లరాదని, గంజాయి, గుట్కా, పొగాకుతో తయారయ్యే వస్తువుల జోలికి వెళ్లొద్దని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు సుధా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'శక్తి యాప్ సద్వినియోగం చేసుకోండి'

చింతూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌ని ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలని కానిస్టేబుళ్లు రాజమణి, చంద్రయ్య కోరారు. చింతూరు జూనియర్ కళాశాలలో ఓ యువతా మేలుకో జీవితాన్ని-నిలుపుకో కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ రమేష్‌బాబు అధ్యక్షత వహించగా అధ్యాపకులు సుశీల, శ్రీనివాసరావు, గణేష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

మోతుగూడెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో ప్లాస్టిక్ సంచుల వినియోగంతో ప్రమాదం పొంచి ఉంది. ఇది తెలియక ప్రజలు ఇంకా వాటిని వాడుతూ నేఉన్నారు. వాటివల్ల పర్యావరణానికి ముప్పు ఉందని తెలిసినా వాటి వాడకం ఎక్కువగా ఉంటోంది. చాలా ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకంపై స్వచ్ఛంద సంస్థలు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాయి. అయినా ఏజెన్సీలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉంది. ప్రజలు దుకాణాలనుంచి సరుకులు తెచ్చుకుని వాటిని రోడ్లపై బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. వాటిని పశువులు తినడంవల్ల ప్రాణహాని కలుగుతోంది. దీనివల్ల పశువులు మరణిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్ల వాడకం మాని గుడ్డ సంచులు ఉపయోగించుకునేలా చూడాలి. అధికారులు స్పందించి ప్లాస్టిక్ వినియోగం తగ్గేలా చూడాలని పర్యావరణ ప్రేమికులు, జంతు ప్రేమికులు కోరుతున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

దేవీపట్నం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు వన్ ఏనుగులగూడెం అగ్రహారం ఆర్అండ్ఆర్ కాలనీని బుధవారం డిప్యూటీ ఎంపీడీవో పీజీ రామకృష్ణ సందర్శించారు. రికార్డు వెరిఫికేషన్ చేసి సచివాలయం సిబ్బందికి సమావేశం నిర్వహించి జాబ్‌చార్టుపై రికార్డు నిర్వహణపై సూచనలు ఇచ్చారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించి ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. పగటిపూట వెలుగుతున్న వీధిలైట్లు నిర్వహణపై సూచనలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ కుంజం రాజామణి, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఆ భూములు గిరిజన పేదలకు పంచాలి

సీపీఎం గిరిజన సంఘం నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన ప్రజాప్రతినిధులు

కూనవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): పోలవరం పరిహారం తీసుకుని స్థానికంగా ఉండకుండా వేరే చోటికి వెళ్లిపోయిన గిరిజనేతర రైతుల భూములను గిరిజన పేదలకు పంచాలని సీపీఎం గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పోలవరం పరిహారం తీసుకున్న గిరిజనేతరుల రైతుల భూములను ప్రభుత్వం తీసుకుందని, అందువల్ల స్థానికంగా లేని రైతుల భూములను ఇక్కడ పేద గిరిజనులకు పంచాలని కోరారు. ప్రభుత్వం ఆవిధంగా చేయకపోతే ఆదివాసీ నాయకులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన ప్రజాప్రతినిధులు బొగ్గ రామారావు, దుర్మల అమ్మాజీ, సంఘ నాయకులు బాలు బొరయ్య, పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

తాండవ నదిలో
మట్టి అక్రమ తవ్వకాలు!

ఆందోళనలో తీర ప్రాంత రైతులు
పట్టించుకోని అధికారులు



మరువాడ వద్ద తండవ నదిలో జేసీబీతో తవ్వకాల దృశ్యం



నదిలోంచి మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

తుని రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తుని మండలం మరువాడ సమీపంలోని తాండవ నదిలో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా జేసీబీలతో తవ్వకాలు జరిపి ట్రాక్టర్లతో మ ట్టిని తరలించకపోతున్నారు. అధికారుల చోద్యంతో నదీ గర్భానికి తూట్లు పడుతున్నాయి. మట్టి తవ్వకాలతో ఏర్పడిన లోయలతో నదీ తీర ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదీ ప్రవా హం ప్రారంభ మైతే పశువులతో పాటు మనుషులు ప్రమాదాల గురువుతున్నామని, అధికారులు తవ్వకాలు ఆపాలని, తాండవ నది పరిరక్షణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'మానవ అక్రమ రవాణాపై 30 వరకు రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైల్వే పోలీసులు

తునిరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తుని రైల్వే స్టేషన్‌లో చైల్డ్ హెల్ప్‌లైన్, క్రాప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తగా నిర్వహించిన ప్రపంచ బాలల అక్రమ రవాణా వ్యతిరేక పోస్టర్‌ను ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాపై ఈనెల 15 నుంచి 30వరకు రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. క్రాప్ సంస్థ కోఆర్డినేటర్ బి.కుమారి, స్టేషన్ మాస్టర్ వి.అనిల్‌కుమార్, డి.లక్ష్మి, ఆర్.పుష్ప తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు సత్కారం

జగ్గంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను పలువురు సత్కరించారు. గోకవరం తెలుగు రైతు అధ్యక్షుడు చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో గోకవరం ఎల్లమ్మ చెరువు పుంత రోడ్డు అభివృద్ధికి నిధులు ఇచ్చి రోడ్డు పనులు పూర్తి చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ఎల్లమ్మ చెరువు ఛైర్మన్ చింతల సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ షైపాల భగవాన్ రైతులతో కలిసి శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ పుంత రోడ్డును మరొక 500 మీటర్లు పెంచాలని, సచివాలయం 2 వద్ద ఉన్న ఖాళీ స్థలంలో రైతులకు కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇనకోటి నాగేశ్వరరావు, ఇనకోటి సత్యనారాయణ, ఎనకోటి దివాణం, రెడ్డి వీర్రాజు పాల్గొన్నారు.

పంట నమోదుతో రైతులకు మేలు



భద్రవరంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలేశ్వరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పంట నమోదు చేసుకోవడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ సహాయకురాలు దాడిశెట్టి భువనేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని భద్రవరంలో వ్యవసాయశాఖ నేతృత్వంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు ప్రభుత్వం కల్పించే బీమా, పంట నమోదు ప్రక్రియ, ఎరువులు వాడే విధానాలపై అవగాహన నిర్వహించారు. ప్రభుత్వం అందించే కందుల విత్తనాలను పొలం గట్లపై వేసేందుకు రైతు భరోసాకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఏహెచ్ఏ ఆనంద్, రాంబాబు, బాలయ్య పాల్గొన్నారు.

తుమ్మలపల్లి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా రిలీజ్ అవుతున్న సందర్భంగా జగ్గంపేటలో జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు, పవన్ అభిమానులతో 1000 బైక్‌లతో రావులమ్మ తల్లి గుడి దగ్గర నుంచి పంచాయతీ ఆఫీస్, జగ్గంపేట సెంటర్ తిరిగి సినిమా ప్రదర్శించే థియేటర్ల వరకు ర్యాలీగా వెళ్లారు. సినిమా ఘన విజయం సాధించాలని రావులమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిహర వీరమల్లు విజయం సాధించాలని రామవరంలోని ముత్యాలమ్మతల్లి దేవస్థానంలో తుమ్మలపల్లి రమేష్ పూజలు చేశారు.

చెరువులకు జలకళ

ప్రత్తిపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల చెరువులకు జలకళ వచ్చింది. గత 3 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు వల్ల చెరువుల్లోకి పెద్ద ఎత్తున నీరు తరలివచ్చింది. దీంతో బుధవారం పెదశంకర్లపూడి వెంకన్న దొర చెరువు పొర్లు కట్టడం మీదుగా అదనపు జలాలు తరలివస్తున్నాయి. ఏలూరు వెంకటపతి రాజుచెరువు, ఒమ్మంగితో పాటు ధర్మవరం రామభద్రరాజు, చింతలూరు రామానుజం, చెరువులకు నీరు వచ్చింది.



నిండి ప్రవహిస్తున్న పెదశంకర్లపూడి వెంకన్న దొర చెరువు

నీటికుంటలతో భూగర్భ జలాలు పెంపు

కలెక్టర్ షాన్‌మోహన్



కత్తిపూడిలో మొక్కలు నాటుతున్న కలెక్టర్

శంఖవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నీటికుంటలతో భూగర్భజలాలు సంమృద్ధిగా పెరుగుతాయని జిల్లా కలెక్టర్ షగిలి షాన్ మోహన్ అన్నారు. బుధవారం కత్తిపూడిలో రైతు గాబు జనార్ధనరావు పొలంలో వేసిన నీటి కుంటను పరిశీలించి గట్టుపై మొక్కలు నాటారు. నీటికుంటలో వర్షపు నీటిని ఒడిసి పట్టి వర్షాభావ పరిస్థితుల్లో పంటకు వినియోగించుకోవచ్చన్నారు. నీటికుంటలపై రైతులకు అవగాహన కల్పించి త్వరగతిన లక్ష్యాలను పూర్తి చేయాలని అధి కారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటలక్ష్మి, ఎంపీడీవో లక్ష్మీరెడ్డి, ఇన్‌చార్జి ఏపీవో శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ కోటిపల్లి కాశీ తదితరులు ఉన్నారు.

ప్రజలు ఆశలకనుగుణంగా పాలన : ఎమ్మెల్యే



ఎస్.పైడిపాలలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతులపూడి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశలకు అనుగుణంగా కూటమి పాలన జరుగుతుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. బుధవారం ఎస్.పైడిపాల గ్రామంలో టీడీపీ నేతలు గొల్లు పెద్దదివాణం, సత్తిబాబు అధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సత్యప్రభ హాజరై ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామాల్లో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకురాగా పరిష్కరిస్తానని తెలిపారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు, గిరిజనులు హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు పైల పైడిరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇంటంశెట్టి సూర్యభాస్కరరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, కోసూరి కృష్ణ వర్మ, సింహాద్రి పెదబాబు, సోమరౌతు వాళి, లోవరాజు, శ్రీను, జేట్లా రాజా పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించడమే పీ4 లక్ష్యం

ప్రత్తిపాడు ఎంపీడీవో కుమార్‌బాబు



చినశంకర్లపూడిలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రత్తిపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని జయించడమే పీ4 లక్ష్యమని ప్రత్తిపాడు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు చెప్పారు. మండలంలోని చినశంకర్లపూడిలో బుధవారం పీ4 అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ ఏపూరి రామారావు అధ్యక్షతన వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ చినశంకర్లపూడిలో 214 నిరుపేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామని తెలిపారు. మాజీ ఎంపీటీసీ మిరియాల శ్రీను గ్రామంలోని పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల ప్రదేశం నివాస యోగ్యం కాకుండా నిరుపయోగంగా ఉందని కొత్తగా పేదలకు అనువైన చోట ఇళ్ల స్థలాలివ్వాలని, మంచినీటి కొరత, రహదారులు ప్రధాన రహదారుల వెంబడి డ్రైనేజీ, శ్మశాన వాటికకు ప్రహరి వంటి సమస్య లు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాథ్,కార్యదర్శులు వి.వీరబాబు, చెల్లుబోయిన వేణుగోపాల్, కస్తూరి తేజోప్రసాద్, గంగాభవాని తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



జగ్గంపేట రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతానగరం గ్రామంలో పంట పొలాలకు వెళ్లే దారిలో సుమారు 80 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ రఘునాధరావు తెలిపారు. మృతదేహంపై తెల్లచొక్కా, సిమ్మెంటు రంగు ప్యాంటు ఉన్నాయి. వద్ధాప్యం లేదా అనారోగ్య సమస్యలతో మృతిచెంది ఉండవచ్చని ప్రాథమికంగా నిర్ధారించినట్లు ఎస్ఐ తెలిపారు. వ్యక్తిఆచూకీ ఎవరైనా తెలిస్తే 9440796529లో సంప్రదించాలని కోరారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతి

జగ్గంపేట రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధురాలు సక్కుల మంగతాయారు(60) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్ఐ రఘునాధరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. జగ్గంపేట మండలంలోని సీతానగరం సమీపంలో ఇటీవల ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధ దంపతులను స్థానికులు కాపాడి ఆసుపత్రిలో చేర్పించారు. వారిలో సక్కుల సత్యనారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా భార్య మంగతాయారు. బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆదివాసీల ప్రదర్శన, ధర్నా

ప్రత్తిపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడులో ఆదివాసీలు బుధవారం ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. మండలంలోని పొదురుపాక, పాండవులపాలెం, కిత్తమూరుపేటలలో సాగు చేసుకుంటున్న ఆదివాసీల భూములను వలస భూ స్వాములు ఆక్రమించుకుని ఇబ్బందులు పెడుతున్నారని ఆందోళన చేశారు. స్థానిక లిబరేషన్ పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ప్రదర్శన కొనసాగించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆందోళనకు నాయకత్వం వహించిన జిల్లా ఆదివాసీ సంఘ అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం మాట్లాడుతూ ఆదివాసీల భూములు లాక్కోవడమే కాకుండా వారిని బెదిరించి అక్రమ కేసులు పెడతామని బెదిరిస్తున్న వలస భూ స్వాములపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీలను ఆదివాసీలుగా గుర్తించి రక్షణ కల్పించాలని తహశీల్దార్ ఎం.సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, ఆదివాసీ సంఘ నాయకులు ఇరటాకృష్ణ, అడ్డాల విజయ్, ఎస్.రాజబాబు, వి.వీరబాబు, ఎం.మాణిక్యం, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న ఆదివాసీలు

పాఠశాల పరిశీలన



పీఎస్ పూడి పాఠశాలను పరిశీలించిన మండల అధికారులు

ప్రత్తిపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎస్ పూడి పాఠశాలను బుధవారం మండల అధికారులు పరిశీలించారు. ఇటీవల వర్షాలకు ముంపు బారినపడి పాఠశాల ఫ్లోరింగ్ దెబ్బతిందని, మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పాఠశాల హెచ్ఎం కేవీవీ.సత్యనారాయణ మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో కుమార్‌బాబాబు, డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాథ్ పాఠశాలను సందర్శించి పరిస్థితిని గుర్తించారు. 4 రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

ముద్రగడ సతీమణి పూజలు



మృత్యుంజయ హోమంలో పాల్గొన్న పద్మావతి

ప్రత్తిపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి రావాలని ఆయన సతీమణి పద్మావతి మండలంలోని అరుణాచలేశ్వర ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన 63 మంది నాయినార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరుకు చెందిన దాడిశెట్టి నూకాపతి దంపతులు ముద్రగడ కోసం ఆలయ ప్రాంగణంలో చేపట్టిన మృత్యుంజయ హోమంలో పద్మావతి పాల్గొని పూజలు నిర్వహించారు. అపీతకుచాంబ అరుణాచలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, వెంకటరత్నం, రామిశెట్టి నాని, చలంకూరి గొల్లబాబు, ముద్రగడ కుటుంబసభ్యులు ఉన్నారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని వైసీపీ నేతలు రౌతులపూడిలో దుర్గాదేవి ఆలయం వద్ద పూజలు చేశారు. జడ్పీటీసీ గొల్లు చినదివాణం, వాసిరెడ్డి భాస్కరబాబు, సర్పంచ్ శ్రీను, పోలుపర్తి తాతాజీ తదితరులున్నారు.

తడి, పొడి చెత్త సేకరణ పరిశీలన

గండేపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి, గండేపల్లి గ్రామాల్లో జరుగుతున్న తడి, పొడి చెత్త సేకరణను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి కె.రవికుమార్ పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరిస్తున్న వాహనాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. చెత్త సేకరణకు గ్రామస్తులు సహకరించాలని, గ్రామాన్ని ఆరోగ్యంగా ఉంచాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో కె.చంద్రరావు, డిప్యూటీ ఎంపీడీవో ఐఎస్ శ్రీనివాస్, డీపీఆర్సీ గణేష్, కార్యదర్శి కెవిఆర్ ఫణీంద్రకుమార్ ఉన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

ప్రత్తిపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది బుధవారం జె.అన్నవరంలో 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. జెడ్డంగి అన్నవరానికి చెందిన జుత్తుక సుబ్రహ్మణ్యం 30 లీటర్ల సారాను ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా సీఐ పి.శివప్రసాద్, ఎస్ఐ పి.వంశీరామ్ పట్టుకున్నారు. సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తున్న రౌతు శ్రీనుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

'సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయడం దారుణం'

ప్రత్తిపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం పోతులూరు గ్రామ సర్పంచ్ బొండి రాంబాబు చెక్‌పవర్‌ను రాజకీయ కక్షతోనే రద్దు చేయించడం దారుణమని వైసీపీ నర్సాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. పక్షం రోజుల కిందట సర్పంచ్ చెక్‌పవర్‌ను అధికారులు రద్దు చేశారు. దీంతో ముదునూరి మురళీకృష్ణంరాజు సహకారంతో రాంబాబు హైకోర్టులో న్యాయపోరాటం చేయడంతో తిరిగి కోర్టు ఆదేశాల మేరకు చెక్ పవర్ పునరుద్ధరణ జరిగింది. బుధవారం సర్పంచ్ రాంబాబు ధర్మవరం విచ్చేసి ముదునూరి మురళీకృష్ణంరాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

ప్రత్తిపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, ఇవ్‌టీజింగ్‌లకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం కోరారు. స్థానిక రెడ్డి రామ్మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు బుధవారం నిర్వహించిన సమావేశానికి హెచ్ఎం జాన్‌ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి ఇతర మాదక ద్రవ్యాల జోలికి వెళ్లరాదన్నారు. సైబర్ క్రైమ్‌లపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు హైస్కూల్లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎస్ఐ లక్ష్మీకాంతం